'వన మహోత్సవం' ఉద్యమంలా చేపట్టాలి

- ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

కలెక్టరేట్/ విద్యానగర్, జూలై 9 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన ఉద్యమంలా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వన మహోత్సవం, కలెక్టరేట్లలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు, స్వశక్తి మహిళా సంఘాలకు అందించే రుణాలు, సీజనల్ వ్యాధుల కట్టడి, ఉద్యోగుల బదిలీలు తదితర అంశాలపై సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి జిల్లాలో వన మహోత్సవం పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటిస్తామని పేర్కొన్నారు. జిల్లా స్థాయి క్యాడర్ ఉద్యోగుల బదిలీకి సంబంధించి నాలుగు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగుల జాబితా, ప్రస్తుతం ఉన్న ఖాళీల జాబితా శాఖల వారీగా ప్రదర్శించామని పేర్కొన్నారు. 12 వరకు బదిలీల దరఖాస్తులను స్వీకరించి పారదర్శకంగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్ కుమార్, సీపీవో కొమురయ్య, డీపీవో రవీందర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి సుజాత తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

డయేరియా నివారణకు కృషి చేయాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- వైద్యాధికారులతో సమావేశం

విద్యానగర్, జూలై 9: చిన్నారులు డయేరియా వ్యాధి బారిన పడకుండా వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మంగళవారం రాత్రి కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో డయేరియా నియంత్రణపై తీసుకోవాల్సిన చర్యలపై వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వానకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. డయేరియా బారిన పడకుండా పిల్లలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఒకవేళ డయేరియా బారిన పడితే వారికి తగిన చికిత్స అందించాలని పేర్కొన్నారు. ఈ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఫ్లాష్ మాబ్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, డీపీవో రవీందర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఐవో సాజిదా హతహరి, డెమో రంగారెడ్డి, డీసీహెచ్ ఎస్ కృష్ణ ప్రసాద్, హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్వో చందు తదితరులు పాల్గొన్నారు.

పాలం బడికి రైతుల ఎంపిక

తిమ్మాపూర్, జూలై 9: హైదరాబాద్లోని జాతీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో కూరగాయల పంటల్లో సమగ్ర సస్యరక్షణ చర్యల కోసం మండలంలోని 30 మంది రైతులను అధికారులు ఎంపిక చేశారు. వీరికి 14 వారాలపాటు పొలంబడి కార్యక్రమం నిర్వహించి, కూరగాయల సాగులో మెళకువలను నేర్పించనున్నారు. తిమ్మాపూర్ రైతువేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో సస్యరక్షణకేంద్రం అధికారులు నీలారాణి, రవిశంకర్, ఏవో సురేందర్, ఏఈవో పున్నంచందర్, రైతులు పాల్గొన్నారు.

సీట్ల భర్తీకి 12న ప్రవేశ పరీక్ష

చిగురుమామిడి, జూలై 9: చిన్న ముల్కనూర్ మోడల్ స్కూల్లో ఆరో తరగతిలో మిగిలిపోయిన సీట భర్తీకి ఈ నెల 12న ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కొడిమ్యాల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకుముందు దరఖాస్తు చేసుకోని వారు సైతం నేరుగా వచ్చి మోడల్ స్కూల్లో జరిగే పరీక్షకు హాజరు కావచ్చని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమించాలి

సైదాపూర్, జూలై 9: ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం మండలకేంద్రంలో నిర్వహించిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వాటిని నెరవేర్చాలని కోరారు. కార్యకర్తలు ప్రజల పక్షాన ఉండాలని సూచించారు. గ్రామాల్లోని సమస్యలు తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యుడు బత్తుల బాబు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కంది రవీందర్రెడ్డి, నాయకులు ఒడ్నాల వెంకటేశ్, అనిల్, రాజేశం, రవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూలై 9: నగరంలో టవర్ లైన్ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రతిమ మల్టీప్లెక్స్, ఆర్టీసీ బస్స్టాండ్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-2 ఏడీఈ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నూతన నియామకం

కరీంనగర్ రూరల్, జూలై 9: మహిళా కాంగ్రెస్ కరీంనగర్రూరల్ మండలాధ్యక్షురాలిగా మోరపాక మంజుల నియామకమయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు స్తంభం ఎక్కే పరీక్ష

ముకరంపుర, జూలై 9: ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో జేఎల్ఎం అభ్యర్థులకు బుధవారం ఎనిమిదో విడుత స్తంభం ఎక్కే పరీక్ష, సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు ఎస్ఈ వీ గంగాధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్కిల్ కార్యాలయంలో ఉదయం 9గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని తెలిపారు. నియామక కమిటీ ద్వారా పారదర్శకంగా ఎంపిక జరుగుతుందని, జేఎల్ఎం అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలను నమ్మవద్దన్నారు.

గడువులోగా స్మార్ట్సిటీ పనులు పూర్తి

- సీజనల్ పురుగుల్లా వచ్చి మాట్లాడే నాయకులను పట్టించుకోం
- నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం
- నగర మేయర్ సునీల్రావు

కార్పొరేషన్, జూలై 9: కరీంనగర్లో స్మార్ట్సిటీ కింద చేపట్టిన అభివృద్ధి పనులన్నింటినీ ఈ పథకానికి నిర్దేశించిన గడువులోగానే పూర్తి చేస్తామని నగర మేయర్ యాదగిరి సునీల్రావు పేర్కొన్నారు. కొందరు నాయకులు ఏమీ తెలియకుండానే సీజనల్ పురుగుల్లా వచ్చి మాట్లాడుతున్నారని, అలాంటి వారి మాటలను తాము పట్టించుకోమన్నారు. స్మార్ట్సిటీ ప్రాజెక్టు నిధులను వినియోగించుకొని నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసే ప్రక్రియ కొనసాగుతున్నదని వెల్లడించారు. మంగళవారం నగరంలోని కేబుల్బ్రిడ్జి సమీపంలో చేపట్టిన కమాండ్ కంట్రోల్ సెంటర్, స్మార్ట్ సిటీ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ విలేకరులతో మాట్లాడుతూ, ఇప్పటి వరకు జరిగిన స్మార్ట్సిటీ అభివృద్ధిలో తమ పాలకవర్గం పూర్తి స్థాయిలో విజయవంతమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల స్మార్ట్సిటీ మిషన్ గడువు పెంచిందని, ఆలోగా ప్రాజెక్టులో చేపట్టిన పనులన్నీ పూర్తి చేస్తామని తెలిపారు. కరీంనగర్ను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. స్మార్ట్ సిటీ కింద ఇప్పటి వరకు రూ.765 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఇందులో నగరపాలక సంస్థకు రూ.735 కోట్లు విడుదలయ్యాయని, వీటిలో ఇప్పటికే రూ.732 కోట్లు ప్రాజెక్టు పనులకు ఖర్చు చేశామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చిన మిగతా రూ.30 కోట్ల

కమాండ్ కంట్రోల్ సెంటర్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మేయర్ సునీల్రావు

నిధులకు తోడుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా రూ.30 కోట్ల నిధులు రావాల్సి ఉందని వెల్లడించారు. స్మార్ట్సిటీ హోదా వచ్చిన సమయంలో ఏబీడీ (ఏరియా బేస్డ్ డెవలప్మెంట్) కింద డీపీఆర్ ప్రపోజల్ పంపినట్లు తెలిపారు. దాని ప్రకారమే పనులు చేశామన్నారు. ఏ పనులు చేపట్టినా కూడా స్మార్ట్సిటీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ అనుమతితోనే చేశామని చెప్పారు. స్మార్ట్సిటీలో ప్రస్తుతం సివిల్ వర్క్కు సంబంధించిన కాంపోనెంట్, రోడ్లు, డ్రైనేజీలు, లైటింగ్, ఇతరత్రా పనులన్నీ పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. నగరంలో రూ.95 కోట్లతో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్, రూ.15 కోట్లతో స్మార్ట్సిటీ కార్యాలయం, రూ.15 కోట్లతో పద్మనగర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రూ.16 కోట్లతో సెంట్రల్ డిజిటల్ లైబ్రరీ బిల్డింగ్, రూ.10 కోట్లతో కాశ్మీర్గడ్డ రైతుబజార్ మార్కెట్ అభివృద్ధి పనులు సాగుతున్నాయని వివరించారు. మరో వైపు సీఎం అస్యూరెన్స్, నగరపాలక సంస్థ వివిధ గ్రాంట్ల నిధులతో కూడా నగరంలో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. అమృత్ పథకం రూ.147 కోట్లతో విలీన గ్రామాలు, డివిజన్లలో తాగునీటి కోసం పనులకు టెండర్లు పూర్తి చేశామని, ఆ పనులు కూడా కొనసాగుతున్నాయని చెప్పారు. నగరాభివృద్ధే ధ్యేయంగా తమ పాలకవర్గం పని చేస్తుంటే కొంతమంది తెలిసి తెలియక అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని, వారి మాటలను తమ పాలకవర్గం పట్టించుకోదన్నారు. ప్రజలు తమకు ఇచ్చిన అవకాశంతో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ మహేందర్, ఏఈ గట్టు స్వామి, నగరపాలక సంస్థ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకులాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

గంగాధర, జూలై 9: మండల కేంద్రంలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో సోమవారం విద్యుత్ షాక్తో విద్యార్థులకు గాయాలు కావడంతో మంగళవారం పాఠశాలను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ శాఖ, వెనుకబడిన తరగతుల శాఖ అధికారులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. అనంతరం ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థి అశ్విత్ను పరామర్శించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ సరిత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్రావు, నాయకులు ఆకుల మధుసూదన్, కంకణాల విజేందర్రెడ్డి, వేముల దామోదర్, వేముల అంజి, రామిడి సురేందర్, ఎండీ నజీర్, శ్రీమల్ల మేఘరాజు, అలువాల తిరుపతి, కర్ర శ్రీనివాస్రెడ్డి, వడ్లూరి ఆదిమల్లు, జోగు లక్ష్మీరాజం, ఎస్ శ్రీనివాస్, లోకిని ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేసవి భత్యం విడుదల చేయాలి

కలెక్టరేట్, జూలై 9 : ఉపాధి హామీ కూలీలకు వేసవిలో అందజేసే ప్రత్యేక భత్యం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఉపాధి కూలీల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి కొయ్యడ సృజన్కుమార్ డిమాండ్ చేశారు. నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఏటా వేసవిలో ఉపాధి పనులకెళ్లే కూలీలకు ప్రత్యేక అలవెన్సులతో పాటు భత్యం మంజూరు చేయాల్సి ఉండగా, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఏటేటా తగ్గిస్తూ, రెండేళ్లుగా అసలు భత్యమే విడుదల చేయడం లేదని ధ్వజమెత్తారు. సమావేశంలో సంఘం నాయకులు ప్రభాకర్, రాయబోస్, బోయిని ఎల్లయ్య, మారుపాక లక్ష్మయ్య, అందె రాములు, పున్న రవి, లక్కాకుల విష్ణుతో పాటు జిల్లాలోని పలు మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

భూ వివాదంలో రైతు ఆత్మహత్యాయత్నం

కరీంనగర్ రూరల్, జూలై 9: ఇరవై యేండ్ల క్రితం సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసిన భూమిని, ఇప్పుడు విలువ పెరిగిందని రిజిస్ట్రేషన్ చేసేందుకు యజమాని నిరాకరించడంతో మనస్తాపం చెందిన రైతు ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన ఇరుకుల్ల గ్రామంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు.. సోమవారం కరీంనగర్ మండలం ఇరుకుల్ల గ్రామానికి చెందిన బుర్ర లచ్చయ్య అనే రైతు దాదాపు 20 సంవత్సరాల క్రితం బుర్ర ఓదెలు నుంచి నాలుగు గుంటల వ్యవసాయ భూమిని సాదాబైనామా ద్వారా కొనుగోలు చేశాడు. కొంత కాలంగా సదరు భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని కోరగా, భూమి ధర పెరిగిందని, ఎక్కువ డబ్బులు చెల్లించాలని ఓదెలు డిమాండ్ చేయడంతో లచ్చయ్య ఇటీవల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం జరిగిన కుల పంచాయితీలో భూమి రిజిస్ట్రేషన్ చేసేందుకు తనకు రూ.1.50 లక్షలు చెల్లించాలని ఓదెలు డిమాండ్ చేయగా, రూ.లక్ష ఇచ్చేందుకు లచ్చయ్య ముందుకువచ్చాడు. ఓదెలు ఒప్పుకోకపోవడంతో పంచాయితీ వాయిదా పడగా, తీవ్ర మనస్తాపానికి గురైన లచ్చయ్య సాయంత్రం ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. స్థానికులు 108 అంబులెన్స్కు సమాచారం అందించి జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు తరలించగా వైద్యులు చికిత్స చేస్తున్నారు.

బల్దియా ఎదుట సీపీఎం ఆందోళన

కార్పొరేషన్, జూలై 9: కరీంనగర్లోని అర్హులైన పేదలందరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని, నగరంలో వీధి కుక్కలు, కోతుల బెడదను నివారించాలని సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి నగరపాలక అధికారులు చర్యలు చేపట్టకుండా చోద్యం చూస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు పున్నం రవి, పుల్లెల మల్లయ్య, కొంపల్లి సాగర్, నాయకులు గజ్జల శ్రీకాంత్, కనకరాజు, రోహిత్, నాగమణి, అన్నపూర్ణ, రోజా, శ్రీకాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

10న జాతీయ కోర్కెల దినం పాటించాలి

తెలంగాణచౌక్, జూలై 9: ఆర్టీసీలో ఈనెల 10న జాతీయ కోర్కెల దినంగా పాటించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి రవీందర్రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఆర్టీసీ ప్రకటించిన ఉద్యోగాల్లో జూనియర్ అసిస్టెంట్ (క్లరికల్) పరీక్ష రాసే అభ్యర్థులకు రీజియన్ స్థాయిలో ఫెడరేషన్ రీజియన్ కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవీందర్రెడ్డి మాట్లాడుతూ, ఆర్టీసీలో కార్మికుల వ్యతిరేక కోడ్లను రద్దుచేయాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు పలు సూచనలిచ్చారు.

హామీలు అమలు చేయాలని వినతులు

గన్నేరువరం/ సైదాపూర్, జూలై 9: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మంగళవారం ప్రజా సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో గన్నేరువరం తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ ప్రజాసంఘాల కన్వీనర్, గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి కాల్వ సురేశ్ యాదవ్ తదితరులున్నారు. అలాగే సైదాపూర్ తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ మంజులకు సీపీఎం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజిరెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి గుండేటి వాసుదేవ్, నాయకులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ముఖ ద్వారం ముందే నిలిచిన నీరు

కరీంనగర్లో వర్షపు నీటిని తొలగిస్తామని చెబుతున్న నగరపాలక సంస్థ అధికారులు, తమ కార్యాలయ ప్రధాన ద్వారం ముందే వర్షపు నీరు రోజుల తరబడిగా నిలిచి ఉన్నా పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. సీసీ రోడ్డు నిర్మించిన ఇంజినీరింగ్ అధికారులు, వర్షపు నీరు పల్లపు వైపు మళ్లేలా చేయకపోవడం వారి పనితీరును చెప్పకనే చెబుతున్నది. -కార్పొరేషన్, జూలై 9

మున్సిపల్ సాధారణ సమావేశం

సమావేశం అనంతరం నూతన వాహనాన్ని ప్రారంభిస్తున్న చైర్ పర్సన్, పాలకవర్గం

హుజూరాబాద్, జూలై 9: మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్పర్సన్ గందె రాధిక అధ్యక్షతన మంగళవారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో 93 అంశాలను ప్రస్తావించగా, పాలకవర్గ సభ్యులు 91 ఆమోదించారు. పట్టణ సుందరీకరణలో భాగంగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.కోటీ 20లక్షలతో బస్సు డిపో క్రాస్ వద్ద జంక్షన్ నిర్మాణం, కరీంనగర్, వరంగల్ రోడ్డు ప్రవేశ మార్గంలో స్వాగత తోరణాలు నిర్మించాలని నిర్ణయించారు. అలాగే రూ 32 లక్షలతో 25, 29వ వార్డుల్లో ఓపెన్ జిమ్లు ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనంతరం చెత్త సేకరణ కోసం కొనుగోలు చేసిన నాలుగు ఆటో ట్రాలీలను చైర్పర్సన్ పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రారంభించారు. పారిశుధ్య కార్మికులకు బూట్లు, సబ్బులు, కొబ్బరి నూనె, మాస్కులు, చేతి గ్లౌసులు, బట్టలు పంపిణీ చేశారు. సమావేశంలో వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, కమిషనర్ సమ్మయ్య, ఇన్చార్జి మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ సాంబరాజు, టీపీఎస్ అశ్వినీ గాంధీ, ఇన్చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ కిషన్ రావు, సీనియర్ సహాయకుడు సంపత్ రావు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

చొప్పదండి పట్టణంలోని ఏడో వార్డులో మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, అధికారులు

చొప్పదండి, జూలై 9: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, కమిషనర్ నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం మొక్కల పెంపకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏడో వార్డు ప్రజలకు ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రశాంత్ కుమార్, ఇన్చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ ఎన్నం అంజయ్య, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ శివాణి, వార్డు ఆఫీసర్లు లక్ష్మయ్య, మహేశ్, సాగర్, వీరేశం, కొమురయ్య, మల్లయ్య, ప్రకాశ్, జ్యోతి, సుధాకర్, స్వర్ణకుమారి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు, విద్యార్థులు

కమాన్చౌరస్తా, జూలై 9 : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలో ఘనంగా జరుపుకొన్నారు. ఇందులో భాగంగా, నగరంలో శోభాయాత్ర నిర్వహించి ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో బహిరంగ సభ నిర్వహించారు. ఇక్కడ ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జానా రెడ్డి స్వామి ఏబీవీపీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఏబీవీపీ 75 ఏళ్లుగా అనేక విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తున్నదని, విద్యార్థుల భవిష్యత్ కోసం అనునిత్యం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో విభాగ్ కన్వీనర్ కోడి అజయ్, జిల్లా ప్రముఖ్ రాచకొండ గిరి బాబు, జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, నగర కార్యదర్శి బామాండ్ల నందు, రాష్ట్ర కార్యాసమితి సభ్యుడు అంజన్న, స్టేట్ లాఫోరం కో-కన్వీనర్ ప్రమోద్, వంశీ, విష్ణు, ప్రదీప్, విగ్నేశ్, విష్ణు, ప్రశాంత్, ఆకాశ్, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే, శాతవాహన యూనివర్సిటీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

టిప్పర్ ఢీకొని గాయపడిన వ్యక్తి మృతి

శంకరపట్నం, జూలై 9: లింగాపూర్ గ్రామంలో టిప్పర్ ఢీకొని గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన కాశక రఘువరన్ (44) ఈ నెల 7న తన మరదలి ఇంట్లో ఓ శుభకార్యం కోసం శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి వచ్చాడు. అక్కడ తన బావమరిది పోరమల్ల శ్రీనివాస్తో కలిసి వ్యక్తిగత పనిపై బైక్పై పక్కనే ఉన్న మెట్పల్లి గ్రామానికి బయలుదేరారు. బైక్ లక్ష్మీనరసింహా రైస్ మిల్లు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ బైక్ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ఇద్దరు కింద పడగా వెనుక కూర్చున్న రఘువరన్కు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం వరంగల్లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ కే రవీందర్పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

విద్యార్థికి అభినందన

విద్యార్థిని అభినందిస్తున్న అనుదీప్

కమాన్చౌరస్తా, జూలై 9 : జిల్లా కేంద్రంలో ఇటీవల జీనియస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్లో అద్వైత ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి ఎస్ శ్రావిక్ మూడో స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా అద్వైత ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ సొగాని అనుదీప్ విద్యార్థిని అభినందించి మాట్లాడారు. జిల్లా స్థాయిలో తమ పాఠశాల విద్యార్థి చక్కని ప్రతిభతో, మంచి ఏకాగ్రతతో టోర్నమెంట్లో మూడో ర్యాంకును సాధించడం అభినందనీయమన్నారు. తమ పాఠశాల విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించేలా ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు.

వైద్యుడిపై దాడికి యత్నం: పోలీసులకు ఫిర్యాదు

రాంనగర్, జూలై 9: కరీంనగర్ మండలం బొమ్మకల్లోని చల్మెడ హాస్పిటల్లో విధి నిర్వహణలో ఉన్న వైద్యుడిపై దాడికి యత్నించిన వ్యక్తిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడైన వైద్యుడు బానోతు రవికుమార్ ఫిర్యాదు మేరకు వివరాలు.. చల్మెడ వైద్య కళాశాలలో పీజీ చదువుతూ విధులు నిర్వహిస్తుండగా ఈనెల 7న ఓ వ్యక్తి వచ్చి తనకు ట్రీట్మెంట్ చేయాలంటూ రవికుమార్ ఉన్న గది అద్దాలు పగులగొట్టి దాడికి యత్నించాడు. అడ్డు వచ్చిన సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేశాడు. దాడికి యత్నించిన వ్యక్తి శ్యాం అనే పేరుపై క్యాజువాలిటిలో రాయించాడని, అతడిపై చర్య తీసుకోవాలని కోరారు. రవికుమార్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రదీప్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ నేరంలో ఐదుగురికి జైలుశిక్ష

రాంనగర్, జూలై 9: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 23 మందిని ట్రాఫిక్ పోలీసులు మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. వీరిలో ఇద్దరికి ఐదు రోజులు, ముగ్గురికి మూడు రోజుల జైలుశిక్షతో పాటు జరిమానా విధించగా, 18 మందికి రూ.27వేల జరిమానా విధించారు.

బీసీ విద్యార్థులకు సీట్లు కేటాయించాలని మంత్రికి వినతి

తెలంగాణచౌక్, జూలై 9: ప్రభుత్వ బీసీ కళాశాలలు, వసతి గృహాల్లో దరఖాస్తు చేసుకున్న బీసీ విద్యార్థులందరికీ సీట్లు కేటాయించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్కు మంగళవారం వినతి పత్రం అందజేసినట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ తెలిపారు. కాగా, తమ వినతులపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన చెప్పారు. ఇక్కడ బీసీ నాయకుడు రాజు ఉన్నారు.

'హామీలు అమలు చేయకపోతే అడ్డుకుంటాం'

రామడుగు, జూలై 9 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే అడుగడుగునా అడ్డుకుంటామని